క్లుప్తంగా

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ



రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి ఎంపీయూపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థి ల్యాప్‌టాప్, ప్రింటర్లను సోమవారం వితరణ చేశారు. పూర్వ విద్యార్థి జక్కేపల్లి రమేష్ వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్‌కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, విద్యార్థి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఏ.కొండూరు: ఏ.కొండూరు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త తోటరాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి కె.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. గతంలో మృతురాలి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు దివిజ, దివ్య, సూపర్‌వైజర్ మురళీకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం

తిరువూరు: ఏ.కొండూరు మండలం పోలిశెట్టిపాడుకు చెందిన కోటమర్తి సత్యశ్రీకి యువభారత్ శక్తి ఫౌండేషన్ నిర్వాహకులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. విజయవాడ మణిపాల్ ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్న సత్యశ్రీకి వైద్య సేవల నిమిత్తం ఈ ఆర్థిక సాయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు అందజేసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ట్రస్ట్ సేవలను పలువురు అభినందించారు.

వర్షపు నీటితో ప్రజలకు తప్పని ఇక్కట్లు



తిరువూరు: పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీప ప్రాంతాల్లో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇటీవల కురిసిన అధిక వర్షాలకు స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డ్రైవర్స్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ఆర్టీసీ కాలనీల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయి మోకాలిలోతు నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. నిల్వ ఉన్న వర్షపు నీటి వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటి మళ్లింపునకు నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డ్రెయినేజీ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదని బీజేపీ నాయకుడు సింహాచలం ఆరోపించారు.

పరస్పరం దాడులు.. కేసుల నమోదు

ముసునూరు: పరస్పరం దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు నమోదైనట్లు ఏఎస్ఐ నాగభూషణరావు తెలిపారు. మండలంలోని చింతలవల్లిలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి పల్లిపాము వెంకటేంద్రబాబు, అతని తండ్రి సుగుణరావు, నూజివీడు మండలం ముక్కొల్లుపాడుకు చెందిన గుడ్డేటి గోపిరాజు, పల్లిపాము రవి పరస్పరం దూషణలతో ఘర్షణ పడి కర్రలతో దాడులు దిగారు. ఇరువర్గాల వారికి గాయాలు కావడంతో పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు.ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో సోమవారం రాత్రి ఇరువర్గాలకు చెందిన నలుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కారు డ్రైవర్‌కు జరిమానా

నూజివీడు: కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి మోటార్ సైక్లిస్టును తీవ్రంగా గాయపరిచిన కారు డ్రైవర్‌కు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. చింతలపూడి మండలం యర్రంపల్లికి చెందిన గుజ్జర్లపూడి రవి జనవరి 6, 2019న కారుతో నూజివీడు బైపాస్‌రోడ్డులో అతివేగంగా వచ్చి మోటార్ సైక్లిస్టును ఢీ కొట్టాడు. దీంతో మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం కారు డ్రైవర్‌కు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్పెషల్ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశంతో ఆనందోత్సాహాలు

నూజివీడు: గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద వర్గాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ట్రిపుల్ ఐటీలు వరంగా మారాయి. పలువురు గ్రామీణ విద్యార్థులు కష్టపడి చదివి ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించారు. ఒక్కసారి సీటు వచ్చిన తరువాత ఆరేళ్ల పాటు ఇక్కడే ఉండి సమీకృత ఇంజినీరింగ్ విద్యను ఉచితంగా చదువుకోవచ్చు. కౌన్సెలింగ్‌లో సీటు ఖరారైన తరువాత వారి ఆనందానికి అవధుల్లేవు. తాము పడ్డ కష్టానికి ఫలితం దక్కిందంటూ పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తొలిరోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందిన ముగ్గురు టాపర్ల మనోగతాలు వారి మాటల్లోనే...



స్టేట్ టాపర్ లిఖితకు బహుమతి అందజేస్తున్న నూజివీడు డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్

ఐఏఎస్.. నా కల



నాన్న వాసుదేవరెడ్డి సన్నకారు రైతు. మాకున్న ఎకరన్నర పొలంలో పంటలు సాగు చేస్తూ, కూలి పనులకు వెళ్తూ ముగ్గురిని చదివిస్తున్నారు. మా అక్క బీటెక్ చదువుతోంది. నేను అన్నమయ్య జిల్లా కలకడలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో పదో తరగతి చదివాను. 597 మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఐఏఎస్ కావాలనేది నా కల.

– పి.లిఖిత, కొత్త వేపకుప్పం, తిరుపతి జిల్లా

కలెక్టర్ కావాలన్నదే నా లక్ష్యం



మాది రోజువారీ కూలీ కుటుంబం. నా తండ్రి వేణుగోపాల్ రోజువారీ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. శ్రీకాళహస్తిలోని సరస్వతీబాయ్ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదివా. 596 మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. సివిల్స్ రాసి కలెక్టర్ కావాలన్నదే నా లక్ష్యం.

– కె.లక్ష్మీప్రియ, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా

నాన్న కూల్‌డ్రింక్ షాపు నడుపుతారు



మా నాన్న రామకృష్ణ చిన్న కూల్‌డ్రింక్ షాపు నడుపుతారు. ఓడలరేవులోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివి 595 మార్కులు సాధించడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. సివిల్ సర్వీసెస్‌లో చేరాలని ఉంది. అక్క కూడా నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోంది.

– పినపోతు ఈషిత, ఓడలరేవు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

క్వారీ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వినతులు



ఇబ్రహీంపట్నం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: క్వారీ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు కనీస భద్రత కల్పించని క్వారీల లైసెన్స్‌లు రద్దు, నిరంతర తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, పీఎఫ్, గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. నాయకులు విఠల్ రావు, ఎస్కే బాషా, నారాయణ, సుబ్రహ్మణ్యం, శ్రీను పాల్గొన్నారు.

భూ అధీకృత రైతుల చట్టం అమలుచేయాలి



తిరువూరు తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న రైతుసంఘ నాయకులు

తిరువూరు: 2011 భూ అధీకృత రైతు చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఏపీ కౌలురైతు సంఘం, రైతుసంఘం తిరువూరు మండల కమిటీలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు సోమవారం వినతిపత్రం సమర్పించాయి. భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామ రెవెన్యూ అధికారులు కౌలురైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలన్నారు. పంట నమోదులో ఈక్రాప్ బుకింగ్ కౌలు రైతుల పేరుతోనే చేయాలని, అగ్రవర్ణ కౌలురైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కౌలురైతు సంఘ మండల అధ్యక్షుడు వేముల హరికృష్ణ, రైతుసంఘ అధ్యక్షుడు సాంబారు వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించారు.

వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలి

విస్సన్నపేట: మాంసాహార వ్యర్థాలను కొందరు వ్యాపారులు విస్సన్నపేటలోని ప్రధాన రహదారుల వెంట వేయటం వలన దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు తెలిపారు. వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ స్వాతికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జ్ఞానరత్నం, నాయకులు ధనమ్మ, రంగారాణి, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఏనుగుగడ్డ వాగుకు పెరిగిన వరద ఉధృతి



జూపూడి(ఇబ్రహీంపట్నం): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలకు ఏనుగుగడ్డ వాగుకు వరద ప్రవాహం పెరిగింది. చినలంక, పెదలంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జూపూడి, మూలపాడు గ్రామాల వద్ద సప్టాలపై వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. చిలుకూరులో వ్యవసాయ పొలాలు నీటిముంపునకు గురయ్యాయి. వ్యవసాయ పొలాలకు రైతులు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికే అరటి, మొక్కజొన్న, మునగ, మినుము, పత్తి, వివిధ రకాల కూరగాయల పంటలు వేశారు. చినలంక పెదలంక గ్రామాలకు రాకపోకలు స్తంభించడంతో ప్రజలు ప్రమాదం అంచున పడవల ద్వారా వాగుదాటి వెళ్లాల్సి వస్తోంది.

బోధనా సామగ్రితో విద్యార్థులకు అవగాహన

- పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ప్రారంభం
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

మైలవరం: బోధనా సామగ్రితో విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఎల్.బాలు తెలిపారు. మైలవరం ఎస్వీఆర్‌జీఎస్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవం(శిక్షా సప్తాహ్) కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ–2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో బోధనా సామగ్రిని ప్రదర్శనగా పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ రామకృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే మైలవరం 6వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్ రావు, శ్రీలక్ష్మి, పాల్గొన్నారు. మైలవరం ఎంబీఎం జిల్లా పరిషత్– ప్లస్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోధనోపకరణాల ప్రదర్శన

గంపలగూడెం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సోమవారం బోధనోపకరణాల ప్రదర్శన చేశారు. నూతన విద్యావిధానం అమల్లోకి వచ్చిన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశానుసారం వారం రోజులు నిర్వహించనున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా టీఎల్ఎం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి రోజైన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జింకలపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ – 1, 2 పీవీడీఎల్ నరసింహారావు, శ్యాంసుందర రావులు పాల్గొని మాట్లాడారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమం వివరాలను, ఆశయాలను తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నూతన విద్యా విధానం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత ఫలితాలు సాధించాలని చెప్పారు. ఆయా పాఠశాలల్లో బోధనా పరికరాల ద్వారా పలు అంశాలను ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు.



లక్ష్మీపురంలో బోధనోపకరణాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

లక్ష్మీపురంలో శిక్షా సప్తాహ్

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చి 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు బోధనకనుగుణంగా రూపొందించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత మోడల్స్, సూక్ష్మదర్శిని మోడల్, స్వయం అభ్యసన చార్టులు, మోడల్ పవర్ స్టేషన్ తదితర అంశాలను ప్రదర్శించారు. లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, ఉపాధ్యాయులు సుజాతాకుమారి, పద్మలత, లక్ష్మీ శ్యామల పాల్గొన్నారు.

సులభరీతిలో బోధనకు టీఎల్ఎం దోహదం

గానుగపాడు(తిరువూరురూరల్): సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధనా ఉపకరణాలను రూపొందిస్తున్నట్లు తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభ సందర్భంగా పాఠశాలలో బోధనోపకరణాల ప్రదర్శనను సోమవారం ఆమె ప్రారంభించారు. చార్టులు, కథలు చెప్పే చార్టులు, ఫ్లాష్ కార్డులను ప్రదర్శించారు. 1వ తరగతి నుంచి అన్ని స్థాయిల్లో బోధనకూ టీఎల్ఎంలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఆదిలక్ష్మి పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో బోధనోపకరణాల తయారీని ఉపాధ్యాయులకు వివరించారు.



జింకలపాలెంలో టీఎల్ఎం ప్రదర్శనలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు



మైలవరంలో బోధనా సామగ్రితో ఎంఈఓ బాలు, ఉపాధ్యాయులు

ముసునూరులో వాయిదా

ముసునూరు: మండలంలో సోమవారం నిర్వహించాల్సిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం వర్షాల కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో మంగళవారానికి వాయిదా వేశామని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. స్థానిక వనరులతో తయారు చేసిన బోధనా సామగ్రి ప్రదర్శన, పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్ర పరిచయం, నైపుణ్యాల అభివృద్ధి తదితర కార్యక్రమాలను మంగళవారం నిర్వహిస్తామన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదవడంతోనే విజయాలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రణాళికా బద్ధంగా చదవడంతోనే పోటీ పరీక్షల్లో విజయాలు వరిస్తాయని ఎస్ఎస్ కన్సల్‌టెన్సీ, ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి ఏవీఎస్ శేఖర్ అన్నారు. నిమ్రా ఫార్మసీ కళాశాలలో పోటీ పరీక్షల్లో విజయాలు సాధించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ సమయంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా షార్ట్‌కట్ మెథడ్స్‌ను అనుసరించాలన్నారు. ప్రిన్సిపాల్ జనార్దన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హీల్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో పతకాలు

ఆగిరిపల్లి: జాతీయ స్థాయిలో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని తోటపల్లికి చెందిన హీల్ పాఠశాలలోని అంధ విద్యార్థులు పతకాలు సాధించారు. ఈనెల 15 నుంచి 17 వరకు బెంగళూరులోని నిర్వహించిన 13వ జాతీయ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో హీల్ పాఠశాలకు చెందిన అంధ విద్యార్థిని జాలా వరలక్ష్మి లాంగ్ జంప్ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి, రజత పతకం గెలుపొందింది. 1,500 మీటర్ల పరుగు పందెంలో సునీల్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. పరుగు పందెంలో సీహెచ్ ప్రవీణ్ 5వ స్థానంలో నిలిచాడని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను హీల్ ఇండియా అధ్యక్షుడు, ఏపీ మాజీ డీజీపీ రామావతార్ యాదవ్ అభినందించారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ సాయిబాబు, అంధ పాఠశాల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుఖవాసి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్ తదితరులు

గురు పౌర్ణమిపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విస్తార ప్రముఖ్ కూనల యుగంధర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గురు పౌర్ణమిని పురస్కరించుకుని కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వివేకానంద కేంద్ర లాక్ మెమోరియల్ కన్యాకుమారి సంస్థ ప్రతినిధి, విస్తార ప్రముఖ్ కూనల యుగంధర్ విద్యార్థులతో కలసి వివేకానందస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాస పౌర్ణమి విశిష్టతను వివరించారు. వారి జన్మ విశేషాలు, వేదాలను గ్రంథాలు, పురాణాలుగా మార్చుచేసి మానవాళికి అందించిన అంశాలను తెలియజేశారు. కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెబ్ డెవలప్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యం



మాట్లాడుతున్న సాయి శశాంక్

మైలవరం: ఆధునిక డిజిటల్ యుగంలో వెబ్ డెవలప్‌మెంట్ అనేది అత్యంత ప్రాధాన్యం గల నైపుణ్యాల్లో ఒకటని ఇన్ఫోస్టెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ భావరాజు సాయి శశాంక్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం, సీఎస్ఐ ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వెబ్ డెవలప్‌మెంట్ బేసిస్ బూట్ క్యాంపు అనే అంశంపై ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వారం రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శశాంక్ మాట్లాడుతూ.. అభ్యసకులను ప్రొఫెషనల్ స్థాయికి తీసుకువెళ్లే క్రమంలో వేగంగా, సమర్థవంతంగా నేర్పించడంలో బూట్ క్యాంప్‌లు బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. యూజర్ ఇంటర్‌ఫేస్, యూజర్ అనుభవం, అభివృద్ధి అప్లికేషన్స్ ఫ్రేమ్‌వర్క్, వారికి ఉద్యోగ అవకాశాలు, ప్రొఫెషనల్ ఎదుగుదల కోసం ఒక బలమైన పునాది ఇస్తోందన్నారు. ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీనివాసరావు ప్రసంగించారు. హేమలత, సాంబశివరావు కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

నేటి నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం)/జి.కొండూరు: మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, ఐదేళ్లలోపు చిన్నారుల కొత్త ఆధార్ నమోదు, ఎన్‌రోల్‌మెంట్‌లు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్ చెప్పారు. జి.కొండూరు మండల పరిధిలోని 16 గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. 23న గంగినేనిపాలెం, చెర్వుమాధవరం, గడ్డమణుగు గ్రామ సచివాలయాల్లో, 24న జి.కొండూరు –1,2, హెచ్ ముత్యాలంపాడు గ్రామ సచివాలయాలు, 25న కట్టుబడిపాలెం, కవులూరు–1,2 సచివాలయాలు, 26న వెల్లటూరు–1,2, కోడూరు, వెలగలేరు సచివాలయాలు, 27న చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను అందిస్తామన్నారు.

తిరువూరు/తిరువూరురూరల్: 23న రాజుపేట పాతతిరువూరు గాజులమాలపల్లిలో, 24న ఎరుకల కాలనీలో, 25న తోకపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో, 26న తోకపల్లి ఎంపీపీ స్కూల్, 27న రాజుపేట–2 సచివాలయంలో ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని కమిషనర్ లోవరాజు తెలిపారు. మండలంలోని ఎర్రమాడులో 23, 24 తేదీల్లో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు.

ముసునూరు/చాట్రాయి: వేల్పుచర్ల, బలివే గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని ఎంపీడీఓ సీహెచ్.పద్మావతీదేవి తెలిపారు. 23న చాట్రాయి, చనుబండ 1,2, 24న పోలవరం, చిన్నంపేట, నరసింహారావుపాలెం, 25న మర్లపాలెం, కొత్తగూడెం, బూరుగుగూడెం, పోతనపల్లి, 26న చిత్తపూరు 2, తుమ్మగూడెం, చీపురుగూడెం, 27న జనార్దనవరం, చిత్తపూరు 1, సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.కుమారి తెలిపారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ



సగ్గురులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆగిరిపల్లి: డెంగీ వ్యాధి, నివారణపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని నూజివీడు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.యలమంద అన్నారు. మండలంలోని ఈదర, సగ్గూరు, నర్సింగపాలెంలో వైద్య సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. దోమ కాటు ద్వారా సంక్రమించే డెంగీపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని, వెంటనే స్థానిక హెల్త్ సెంటర్‌కు లేదా పీహెచ్‌సీ వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులు నాగ జోత్స్న, మంజుల దేవి, సంధ్య ప్రియ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల్లో సస్యరక్షణ చేపట్టాలి



ఆంజనేయపురంలో పంటలు పరిశీలిస్తున్న ఏఓ పద్మ, సర్పంచి కుటుంబరావు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో చేరిన నీటిని తొలగించడానికి రైతులు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. తిరువూరు మండలంలోని ఆంజనేయపురంలో నీట మునిగిన పంట పొలాలను సోమవారం ఆమె పరిశీలించారు. వీలైనంత త్వరగా పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తీసి నేల అదనుకు వచ్చిన వెంటనే అంతర కృషిచేస్తే పంటలకు ఇబ్బంది ఉండదని ఆమె సూచించారు. సస్యరక్షణ చర్యలతో పొలాల్లో రసం పీల్చే పురుగు, పచ్చదోమ, తెల్లదోమ అరికట్టవచ్చని తెలిపారు. గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ కోటేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

సారా విక్రేతకు రూ.20 వేల జరిమానా

తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలోని విస్సన్నపేట మండలం కొండపర్వలో తరచూ సారా విక్రయిస్తూ పట్టుబడుతున్న పంది రాజ్యలక్ష్మికి విస్సన్నపేట తహసీల్దార్ సుజాత సోమవారం రూ.20 వేల జరిమానా విధించారు. తిరువూరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం నిందితురాలిని బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా జరిమానా విధించారన్నారు. తిరువూరు మండలం మునుకుళ్ల సమీపంలో తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న గంపలగూడెం మండలం ఊటుకూరుకు చెందిన ఉప్పతాల తిరుపతిరావును అదుపులోకి తీసుకుని 51 మద్యం సీసాలు, ద్విచక్ర వాహనం స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఏ.సత్యనారాయణ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ సత్యనారాయణ కోరారు.